పీజీ కోర్సుల మొదటి సెమిస్టర్ ఫీజు స్వీకరణ గడువు పొడిగింపు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 28: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని పీజీ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ గడువును పొడిగించినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకామ్, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంలిబ్ఐఎస్సీ, ఎంజేఅండ్ఎంసీ కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును వచ్చే నెల 1వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.300 అపరాధ రుసుముతో 6వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

పీజీ మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 28: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని పీజీ కోర్సుల మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకామ్, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంలిబ్ ఐఎస్సీ, ఎంజేఅండ్ఎంసీ కోర్సుల మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును వచ్చే నెల 6వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.300 అపరాధ రుసుముతో వచ్చే నెల 11వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి

- అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్
- రూ.19.25 లక్షల వ్యయంతో డ్రైనేజీ లైన్

బన్సీలాల్‌పేట్, జనవరి 28: బోయిగూడలోని మేకలమండి ఎదురుగా ఉన్న గాంధీనగర్ మార్గంలో రూ.19.25 లక్షల వ్యయంతో డ్రైనేజీ లైన్ రీ-మోడలింగ్ పనులను మంగళవారం మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రారంభించారు. నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల్లో నూతన రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ పైప్‌లైన్లను ఏర్పాటు చేసి అనేక అభివృద్ధి పనులను పూర్తి చేయడం ద్వారా ప్రజలు ఎన్నో ఏండ్ల నుంచి ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించామని ఆయన అన్నారు. బన్సీలాల్‌పేట్ కార్పొరేటర్ కె.హేమలత, జీహెచ్ఎంసీ డీఈఈ ఆంజనేయులు, జలమండలి డీజీఎం ఆశిశ్, బీఆర్ఎస్ నాయకులు జి.పవన్‌కుమార్‌గౌడ్, ఏసూరి మహేశ్, వెంకటేశన్‌రాజు, కె.లక్ష్మిపతి, ప్రేమ్‌కుమార్, వెంకట రమణ, అరుణ్‌గౌడ్, రవికాంత్, దయానంద్, విజయ్‌కుమార్, ఐశ్వర్య, సీనియర్ సిటిజెన్స్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బోయిగూడలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

ఎమ్మెల్యే పద్మారావుకు పలువురి పరామర్శ

ఎమ్మెల్యే పద్మారావుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

సికింద్రాబాద్, జనవరి 28: అనారోగ్యానికి గురై కోలుకున్న సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావుగౌడ్‌ను మంగళవారం సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లోని ఆయన నివాసంలో పలువురు ప్రముఖులు పరామర్శించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మెట్టుగూడ కార్పొరేటర్ సునీతతో పాటు పలువురు నాయకులు, అధికారులు పద్మారావుగౌడ్‌ను పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

మంద కృష్ణ మాదిగ జాతి ద్రోహి

మాదిగ విద్యార్థి యువ గర్జన సన్నాహక సమావేశంలో పిడమర్తి రవి

గోడ పత్రికను విడుదల చేస్తున్న మాదిగ జేఏసీ చైర్మన్ పిడమర్తి రవి, కమిటీ సభ్యులు

బొల్లారం, జనవరి 28: మంద కృష్ణ మాదిగ జాతి ద్రోహి అని మాదిగ జేఏసీ చైర్మన్ పిడమర్తి రవి అన్నారు. కాషాయపు వస్త్రాలు ధరించి బీజేపీకి అమ్ముడు పోయాడని, మాదిగ జాతిని అవమాన పరుస్తూ బీజేపీకి తాకట్టు పెట్టాడని తీవ్ర విమర్శలు గుప్పించారు. మంగళవారం తిరుమలగిరి గాంధీ కమ్యూనిటీ హాల్ ఆవరణలో మాదిగ జేఏసీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు నగునూరి వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2న జరిగే మాదిగ విద్యార్థి యువగర్జన సన్నాహక సమావేశం నిర్వహించారు. యువగర్జన గోడ పత్రికను పిడమర్తి రవి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాదిగలకు 12శాతం రిజర్వేషన్లు అమలుతోపాటు జిల్లాల వారిగా వర్గీకరణ జరగాలన్నారు. వర్గీకరణ న్యాయమైన డిమాండ్ అని, ఓయూలో జరుగబోయే యువగర్జనలో తమ డిమాండ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వివరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సంద్రు నరసింహ మాదిగ, మీసాల ఎల్లెష్, రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు వేణుగోపాల్, స్టాలిన్, తిరుపతి, రాజేష్, శత్రు, సత్యనారాయణ, సదానందం, యాదగిరి, ప్రవీణ్, సాంబశివ, కార్తీక్, వాసుదేవ్, అరుణ్, వీరమణి, శివ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సన్నాహక సదస్సుకు తరలిరావాలి

సికింద్రాబాద్, జనవరి 28: ఫిబ్రవరి 1న జరుగు వేల గొంతులు, లక్షల డప్పుల హైదరాబాద్ జిల్లా సన్నాహక సదస్సును విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొర్ర భిక్షపతిమాదిగ కోరారు. మంగళవారం సీతాఫల్‌మండిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రారంభమైన డప్పుల ప్రదర్శన చిలకలగూడ గాంధీ విగ్రహం వరకు సాగింది. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును దేశంలో మొదటగా తెలంగాణలో అమలు చేస్తామని అసెంబ్లీ సాక్షిగా మాట ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి మాట మీద నిలబడాలని లేదంటే మాదిగల నిరసనను ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. డప్పు మల్లికార్జున్ మాదిగ ఆధ్వర్యంలో డప్పుల ప్రదర్శన నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి మల్లెపాక అనిల్ మాదిగ మహంకాళి శ్రీనివాస్‌మాదిగ హాజరై మాట్లాడారు. మాదిగ, ఉప కులాల ప్రజలు, విద్యార్థులు, మేధావులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బుంజూరి విజయ్‌మాదిగ, ఎంఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి పల్లెర్ల సుధాకర్ మాదిగ, సీపీఐ సహాయ కార్యదర్శి కొమురెల్లి బాబు, గౌరీ శంకర్‌మాదిగ, తుమ్మల శివప్రసాద్‌మాదిగ, చాగంటి యాదగిరిమాదిగ, దయ్యాల నర్సింగ్‌రావుమాదిగ, గసగంటి విజయ్‌మాదిగ, ఎడ్ల రుద్రిమాదిగ, డప్పు మహేశ్‌మాదిగ తదితరులు పాల్గొన్నారు.

చిలకలగూడలో డప్పుల పదర్శనలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, సీపీఐ నాయకులు

లక్ష డప్పులు.. వెయ్యి గొంతులు.. విజయవంతం చేయాలి

బౌద్ధనగర్‌లో డప్పులతో ప్రచారాన్ని నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు

అమీర్‌పేట్, జనవరి 28: ఫిబ్రవరి 7న లక్ష డప్పులు.. వెయ్యి గొంతుల కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మాదిగలు తరలిరావాలని కోరుతూ అమీర్‌పేట్ డివిజన్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రచారం చేశారు. బౌద్ధనగర్, హరిజన్, గంగుబాయి, ఈరమ్మ బస్తీల్లో సంస్థ నగర అధ్యక్షుడు నర్సింహ, సనత్‌నగర్ ఇన్‌చార్జి ప్రసాద్, అమీర్‌పేట్ దళిత సంఘం నాయకులు గొలుసుల సత్యనారాయణ, డప్పు కృష్ణ, గడ్డం బాబూరావు, గోసు శ్రీనివాస్, గడ్డం రాజు ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. గొలుసుల సత్యనారాయణ మాట్లాడుతూ మాదిగలకు జరుగుతున్న అన్యాయాన్ని చాటేందుకు గల్లీ నుంచి ఢిల్లీ వరకు శాంతియుత ఉద్యమాన్ని సాగించి, ఢిల్లీ పెద్దలను ఒప్పించిన వర్గీకరణను సాధించిన ఘనత ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అని అన్నారు. వర్గీకరణ అమలు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు జరుగుతున్న లక్ష డప్పులు.. వెయ్యి గొంతుల కార్యక్రమానికి తరలివచ్చి మంద కృష్ణ నాయకత్వాన్ని మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రతి మాదిగ సోదరులపై ఉందని ఆయన పేర్కొన్నారు.

నిర్మాణ పనులకు శంకుస్థాపన



పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కొలను లక్ష్మి

అమీర్‌పేట్, జనవరి 28: సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ చొరవతో సనత్‌నగర్ ఎస్ఆర్టీ క్వార్టర్స్‌లో రూ.28 లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులకు కార్పొరేటర్ కొలను లక్ష్మి మంగళవారం శంకుస్థాపన చేశారు. సనత్‌నగర్ ఎస్ఆర్టీని జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లేన్‌లో రోడ్డు శిథిలావస్థకు చేరడంతో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ రోడ్డు నిర్మాణాల కోసం మంజూరు చేసిన నిధులతో పనులు జరుగుతున్నాయని ఆమె పేర్కొన్నాయి. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బాల్‌రెడ్డి, జీహెచ్ఎంసీ డీఈ సాయి సందీప్, ఏఈ జమీల్‌పాషా, బీఆర్ఎస్ నాయకులు రాజేశ్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడిలేని విద్యపై విద్యార్థులకు అవగాహన

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పికెట్ యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.విశాల్

మారేడ్‌పల్లి, జనవరి 28: ఈస్ట్ మారేడ్‌పల్లి సెయింట్ మార్క్స్ కళాశాలలో మంగళవారం పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలకు వెళ్లే విద్యార్థులకు ఒత్తిడిలేని విద్యపై అవగాహన నిర్వహించారు. కార్యక్రమానికి పికెట్ యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.విశాల్‌రాజ్ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఒత్తిడిని అధిగమించడానికి తీసుకోవల్సిన మెలకువలను వివరించారు. ముఖ్యంగా పొగాకు, మత్తుపదార్థాల దూరంగా ఉండాలని సూచించారు. వాటి వల్ల కలిగే దుష్ఫలితాలు, నష్టాల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పలు అంశాలపై అవగాహన కల్పించారు. మానసిక ఒత్తిళ్లకు గురయ్యే విద్యార్థులు, ప్రజలు 14416 (టెలిమానస్) టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్‌చేసి వారి ఇబ్బందులు తెలిపితే సలహాలు, సూచనలు ఇస్తారని వివరించారు. అవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూమారు 200 మంది విద్యార్థులతో పాటు డాక్టర్ జయశ్రీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

త్రినాథరావుకు డాక్టరేట్ ప్రదానం

ముషీరాబాద్, జనవరి 28: ఎపిఖైజో ప్రోఫెటిక్ యూనివర్శిటీ, సౌత్ ఆఫ్రికా యూనివర్శిటీ సంయుక్తంగా నగరానికి చెందిన కారుడు డాక్టర్ సీహెచ్ త్రినాథరావుకు గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేసింది. చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ప్రొఫెసర్ డీఎల్‌కే పిలిప్స్ పాల్గొని డాక్టర్ ఆఫ్ ఫిలాసఫి, డాక్టర్ ఆఫ్ డివినిటీ అందించి సత్కరించారు.

డిగ్రీ కోర్సుల పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 28: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని డిగ్రీ కోర్సుల పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకామ్, బీఎస్సీ, బీబీఏ, బీఎస్‌డబ్ల్యూ కోర్సుల మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను మూడు వారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.500 చొప్పున చెల్లించి వచ్చే నెల 4వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి వచ్చే నెల 6వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

బీఫార్మసీ ఎల్‌పీ రెగ్యులర్, బ్యాక్‌లాగ్, వన్‌టైం చాన్స్ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 28: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఫార్మసీ ఎల్‌పీ పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు మొదటి, రెండు, మూడు, నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షలతో పాటు వన్‌టైం చాన్స్ పరీక్ష ఫీజును వచ్చే నెల 10వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.500 అపరాధ రుసుముతో 13వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను మార్చి నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

వేతనాలు, పెన్షన్లు ట్రెజరీ ద్వారా ఇవ్వాలి

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పెన్షనర్ల జేఏసీ అధ్యక్షుడు లక్ష్మయ్య

చిక్కడపల్లి, జనవరి 28: గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు, పెన్షనర్లకు 010 పద్దు ద్వారా జీతాలు, పెన్షన్లు ట్రెజరీ నుంచి ప్రభుత్వం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పెన్షనర్ల జేఏసీ అధ్యక్షుడు లక్ష్మయ్య అన్నారు. తెలంగాణ జిల్లా గ్రంథాలయ సంస్థల పెన్షనర్ల సంఘం కార్యవర్గ సమావేశం మంగళవారం చిక్కడపల్లిలోని నగర గ్రంథాలయ సంస్థలో నిర్వహించారు. పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కొక్కు దేవేందర్ ఆధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిలుగా పెన్షనర్ల జేఏసీ అధ్యక్షుడు లక్ష్మయ్య, నగర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి హాజరయ్యారు. లక్ష్మయ్య మాట్లాడుతూ జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల, పెన్షన్ల ప్రధాన సమస్య 010 పద్దు ద్వారా వేతనాలు, హెల్త్‌కార్డు అమలు చేస్తే ఆర్థిక భారం ఉండదన్నారు. ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ సంస్థ ఉద్యోగుల, పెన్షన్ల ముఖ్య సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు సిద్ధుల జ్ఞానేశ్వర్, జేఏసీ నాయకులు జి.సత్యనారాయణ, సంఘం ప్రధాన కార్యదర్శి సోమ శివయ్య, కోశాధికారి రాచేపల్లి సుబయ్య, వీరప్ప, తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి

మారేడ్‌పల్లి, జనవరి 28: అనారోగ్యంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏపీలోని బీమవరానికి చెందిన వెంకట రంగారావు (73) నగరంలో ఉంటున్న కుమారుడిని చూసేందుకు స్నేహితులతో కలిసి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. అనంతరం 10వ నంబర్ ప్లాట్ ఫారం పైనుంచి స్టేషన్ బయట ఉన్న క్యాబ్ వద్దకు వెళ్లేందుకు మెట్టు ఎక్కుతుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయి కింద పడిపోయాడు. వెంటనే రైల్వే పోలీసులు 108 అంబులెన్స్ ద్వారా చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపినట్లు పోలీసులు వెల్లడించారు. ఏదైనా అనారోగ్యంతో మృతి చెంది ఉండి ఉంటాడని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న జంపన ప్రతాప్, ప్రధానోపాధ్యాయురాలు చాముండేశ్వరి

బొల్లారం, జనవరి 28: కంటోన్మెంట్ న్యూబోయిన్‌పల్లి ప్రభుత్వ బాలుర ప్రాథమిక పాఠశాలలో గణతంత్ర దినోత్సవేడుకలను పురస్కరించుకొని క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు మంగళవారం బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు చాముండేశ్వరి, ఉపాధ్యాయులు గౌస్ మోహీద్దున్, వెంకట శ్యామల, రాజరాజేశ్వరి, గాయత్రి, బండి శ్రీనివాస్, షకీబ్ హుస్సేన్, వరప్రసాద్, రాజు, క్రాంతి పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ల ఏర్పాటు

సికింద్రాబాద్, జనవరి 28: అడ్డగుట్ట డివిజన్ పరిధిలో హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశారు. సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ సహకారంతో అడ్డగుట్ట కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి ఆదేశాల మేరకు తుకారం గేట్, నందనార్ నగర్, గణేశ్ ఆలయం, ఇంద్రానగర్ సికాలనీల్లో హైమాస్ట్ లైట్లను నూతనంగా ఏర్పాటు చేశారు. అభివృద్ధి పనుల్లో భాగంగా మౌలిక వసతులను కల్పిస్తున్నామని నాయకులు తెలిపారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ప్రాంతాల వారీగా ముందస్తు చర్యలను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అలాగే ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను వెంటనే అధికారులతో కలిసి పరిష్కరిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్, ఎల్లయ్య, నర్సింగ్, దేవయ్య, శంకర్, రామప్ప, రాజు, ఇస్మాయిల్, కిట్టు, రాజు, అమర్, శ్రీనివాస్, మహేందర్, నజీర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనల గురించి వివరిస్తున్న టీటీఐ ఇన్‌స్పెక్టర్ రాంచందర్

బేగంపేట్, జనవరి 28: రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అని బేగంపేట్ టీటీఐ ఇన్‌స్పెక్టర్ రాంచందర్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం బేగంపేట్‌లోని శ్యాంలాల్ బిల్డింగ్ ప్రాంతంలో ఉన్న సెయింట్ జాన్స్ ఉన్నత పాఠశాల, అలాగు కస్తుర్బా, డాన్‌బర్గ్ పాఠశాలలో రోడ్డు భద్రతపై స్కూల్ విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు తగిన ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని చెప్పారు. డ్రైవింగ్ చేసే సమయంలో ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని సూచించారు. రోడ్డు దాటే సమయంలో జీబ్రా లైన్ వద్ద సిగ్నలింగ్ చూసి రోడ్డు దాటాలని చెప్పారు. కార్యక్రమంలో టీటీఐ ట్రాఫిక్ సిబ్బంది కృష్ణ, హీరో మోటార్ కార్ప్ సిబ్బంది సాగర్, శ్రవణ్ పాల్గొన్నారు.

అన్నదానం గొప్పది

సికింద్రాబాద్, జనవరి 28: అన్ని దానాల కన్నా అన్నదానం ఎంతో గొప్పదని మెట్టుగూడ కార్పొరేటర్ సునీత అన్నారు. మెట్టుగూడ మదర్ మేరీ చాపెల్ చర్చి వద్ద మంగళవారం అన్నదానం ఏర్పాటు చేశారు. సతీష్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని స్థానిక కార్పొరేటర్ సునీత ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ మెట్టుగూడ చర్చి వద్ద ఏర్పాటు చేసిన అన్నదానంలో తాను పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు.